క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

అనపర్తి: మండల పరిధిలోని దుప్పలపూడి, రామవరం గ్రామ పంచాయతీల పరిధిలో మూడు వార్డు సభ్యుల స్థానాలకు గాను నిర్వహించే ఎన్నికలకు సంబంధించి మంగళవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి తెలిపారు.

పెదపూడి: మండలంలోని కాండ్రేగుల వార్డు మెంబర్ స్థానానికి మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల స్టేజ్ 1, 2 అధికారి ఎల్.గణేష్‌బాబు తెలిపారు.

రేపటి నుంచి జీడీఎస్ ఉద్యోగుల సమ్మె


రంగంపేట: గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు ఈ నెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయడానికి పూనుకున్నట్లు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజనల్ కార్యదర్శి పైడిశెట్టి భూలోకం తెలిపారు. వడిశలేరు పోస్టాఫీసు వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ 8 గంటల పని వేళలు, పింఛన్, సీనియర్ జీడీఎస్‌లకు అదనపు ఇంక్రిమెంట్లు తదితర 11 డిమాండ్లను పరిష్కరించాలని ఎంతో కాలంగా కోరుతున్నామన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో దశల వారీ ఉద్యమంలో భాగంగా ఈ నెల 10న దేశవ్యాప్తంగా అన్ని డివిజన్ల కార్యాలయాల వద్ద సమ్మె చేస్తామన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు ఎంపీటీసీ సభ్యులు బండారు శివ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నెక్కల రామారావు, గొర్రిపోటి అప్పారావు, పోతల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం


కొవ్వూరి శేషారత్నం

అనపర్తి: గ్రామానికి చెందిన కొవ్వూరి శేషారత్నం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించారు. వివరాల్లోకి వెళితే వృద్ధాప్యం కారణంగా శేషారత్నం మంగళవారం ఉదయం మరణించారు. దీంతో ఆమె కుమారులు కొవ్వూరి సత్య శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి రఘురామప్రసాదరెడ్డిలు తల్లి నేత్రాలను దానం చేయాలని నిశ్చయించుకుని అనపర్తి శ్రీతేతలి రామిరెడ్డి మంగాయమ్మ చారిటీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాధాకృష్ణ ఐ-బ్యాంక్‌కు తెలియజేశారు. ఐ-బ్యాంక్ సిబ్బంది వచ్చి శేషారత్నం కార్నియాలను సేకరించారు.

ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ ప్రారంభం


ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్‌ను ప్రారంభించిన ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషాకుమారి తదితరులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్‌ను ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషాకుమారి, జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి సంయుక్తంగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా పాఠశాలకు 10 ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్, 3 స్మార్ట్ టీవీలు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఆడియో, వీడియో పాఠాలు చెప్పడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఎంపీటీసీలు గొర్రెల భాగ్యలక్ష్మి, శాంతి శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల హెచ్ఎం పల్లా వీర ప్రభాకర్, రొంగల అప్పాజీ పాల్గొన్నారు.

దోమల బెడదకు తెర


ముక్కినాడ గ్రామంలో దోమతెరలో గేదెల సంరక్షణ

- పశువుల సంరక్షణపై శ్రద్ధ
- చర్యలు తీసుకుంటున్న పాడి రైతులు

రాజానగరం: పరిసరాల పరిశుభ్రత మానవాళికే కాదు, పశువుల విషయంలో కూడా ఎంతో అవసరం. అపరిశుభ్ర వాతావరణంతో దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. తద్వారా మనుషులు అనారోగ్యాలకు గురవుతుంటారు. అలాగే పశువులు కూడా. ముఖ్యంగా పాడి పశువులలో పాల దిగుబడి తగ్గిపోతుంది. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాలలో పశువుల సంరక్షణపై రైతాంగం ప్రత్యేక శ్రద్ధ సారిస్తోంది. సాయంత్రం కాగానే పశువులకు దాణా పెడుతూ వాటి వద్ద పొగ పెడుతుంటారు. ఆ పొగ వల్ల దోమలు దూరంగా పోతాయని భావించడం వలన పూర్వీకుల నుంచి ఇది ఒక అలవాటుగా వస్తోంది. అయితే దోమలు అప్‌డేట్ అయ్యాయో, మనుషులు, పశువులు వీక్ అవుతున్నారో తెలీదుగాని, ఎంతగా పొగ పెట్టిన పెట్టిన వారు అక్కడ నుండి వెళ్లిపోవాలే గానీ, దోమలు మాత్రం పోవడం లేదు.

వర్షాకాలంలో..

ఇటీవల నియోజకవర్గంలో కొందరు రైతులు ఇళ్లలో ఉపయోగించే విధంగానే పశువుల పాకలు, గొట్టాలలో దోమల నివారణకు టార్టాయిస్‌లు, మస్కిటో క్వాయిల్స్‌ని కూడా ఉపయోగిస్తున్నారు. మరికొంత మంది రైతులు పశువులకు దోమ తెరలు కట్టి, దోమల బెడద నుంచి పాడి పశువులను సంరక్షించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు. అయితే దోమల బెడద ఎక్కువగా వర్షాకాలం నుంచి ప్రారంభమవుతుంది. దీనిని గుర్తించి ఆ కాలంలో దోమల తెరలను సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా రైతులకు సరఫరా చేస్తే బాగుంటుందని కొంతమంది రైతులు కోరుతున్నారు.

> **అపరిశుభ్రతతో దోమల ఉధృతి**
>
> శుభ్రతకు నోచుకోని రోడ్లు, ప్రక్షాళన కరువైన మురుగు నీటి కాలువలతో కాలాలతో సంబంధం లేకుండా దోమల ఉధృతి పెరుగుతూనే ఉంటుంది. దోమల ఉధృతిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోకుండా టార్టాయిస్‌లు, క్వాయిల్స్ ఎన్ని వాడినా ఎటువంటి ప్రయోజనం ఉండదు. మనం నివాసం ఉండే ప్రాంతాలతో పాటు పశువులు ఉండే చోట కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. ముఖ్యంగా మురుగు నీరు, నిల్వనీరు లేకుండా చూడాలి. పాలిచ్చే మూగ జీవాలు మాత్రం దోమకాటుకు గురైతే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.
>
> – డాక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి, పశువైద్యశాఖ సహాయ సంచాలకులు, రాజానగరం

సమాజ అభ్యున్నతి కోసం పాటు పడాలి


రవి మయూకాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్
- ఎమ్మెల్యేతో కలిసి రవి మయూకాలు పుస్తకావిష్కరణ

అనపర్తి: సమాజ అభ్యున్నతి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, సమాజ ఉన్నతి కోసం ఆలోచన చేయడమే పాలిటిక్స్ అని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి ఆరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జీబీఆర్ సెమినార్ హాలులో రవి మయూకాలు(4వ ప్రచురణ) పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జీబీఆర్ ఐఐటీ విభాగం మాథ్స్ లెక్చరర్ కొత్తపల్లి రవికుమార్ రచించిన ఈ పుస్తకాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి ఉండవల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉండవల్లి అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉన్నత విజయాలు సొంతం చేసుకోవచ్చన్నారు. అనపర్తితో, అనపర్తికి చెందిన పలువురు ప్రముఖులతో తనకు గల సాన్నిహిత్యాన్ని ఉండవిల్లి గుర్తు చేసుకున్నారు. అనంతరం పుస్తక రచయిత రవి కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు, రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, కొత్తపల్లి గోపాల కృష్ణారావు, మహర్షి సాగర్, పాత్రికేయులు కృష్ణకుమార్, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వివిధ పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

మధురపూడి: స్థానిక కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం హీరోషిమా డే నిర్వహించారు. రెండో ప్రపంచ యుద్ధ చివరలో జపాన్‌లోని హీరోషిమా, నాగసాకి పట్టణాలపై అమెరికా అణుబాంబు దాడి చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ కె.సతీష్ బాబు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఆనంద బాబు, రాజేశ్వరి, జూలీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత విభాగాలకు అధ్యక్షుల నియామకం


జానా రాజా శ్రీనివాస్


నెమల వీర్రాజు


పెన్నాడ దుర్గాప్రసాద్

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలలో ఒకటైన చేనేత విభాగానికి అధ్యక్షులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మంగళవారం ప్రకటించారు. మండలాల వారీగా రాజానగరానికి జానా రాజా శ్రీనివాస్ (నరేంద్రపురం), కోరుకొండకు నెమల వీర్రాజు (కనుపూరు), సీతానగరానికి పెన్నాడ దుర్గాప్రసాద్ (రఘుదేవపురం) నియమితులయ్యారు.

రాజానగరం పీహెచ్‌సీ సందర్శన


రాజానగరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రాజానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కేంద్ర గణాంకాల అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వ పరంగా అమలవుతున్న పథకాలు, రోగులకు అందిస్తున్న సేవలు, ముఖ్యంగా జననీ సురక్ష యోజన పథకం అమలు తీరును రికార్డులతో సహా క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న లబ్ధిదారులను కూడా ప్రశ్నించారు. అనంతరం చక్రద్వారబంధంలోని హెల్త్ క్లినిక్‌ను సందర్శించి, పని తీరును పరిశీలించారు. టి.రామారావు, రాఘవేంద్రతో కూడిన కేంద్ర బృందం వెంట డీపీఎంఓ డాక్టర్ అభిషేక్, జిల్లా ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ సుదీర్, డాక్టర్ టి.రవికుమార్ ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


రంగంపేట పీహెచ్‌సీలో చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యులు

రంగంపేట: గర్భిణులకు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మి ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.లావణ్య, ఎ.అనూషలు మాట్లాడుతూ మండలంలో ఇంటింటికీ సర్వే నిర్వహించి టీకాలు వేయించుకోని 17 మంది గర్భిణులను, 27 మంది ఐదేళ్లలోపున్న చిన్నారులను గుర్తించామన్నారు. వారందరికీ మిషన్ ఇంద్రధనస్సులో టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, వార్డు మెంబరు ఎస్.వీర వెంకట సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓలు ఎస్‌వీబీ శంకర్, బి.కాటమరాజు, పీహెచ్ఎన్ ఎల్.గంగాభవాని పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022-23లో ఉపాధి హామీ పథకం పనులపై చర్చించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ పి.జగదాంబ, అంబుడ్స్‌మెన్ జ్యోతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 1,020 పనులకుగాను అంచనా విలువ రూ.8.43 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. దీనిపై ఆడిట్ నిర్వహించి, దానికి సంబంధించిన తనిఖీ నివేదికను ప్రజావేదికలో ఎస్ఆర్పీలు, డీఆర్పీలు సమర్పించారు. ఎమ్ బుక్ కొలతలు లెక్కకట్టడంతో తప్పులు జరగడంతో టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.500 జరిమానా విధించారు. ఆడిట్ రికార్డుపై డ్వామా పీడీ జగదాంబ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఏపీవో కె.నాగ శేషవేణి పాల్గొన్నారు.

స్వనిధి రుణాలతో వ్యాపారాభివృద్ధి



సక్రమంగా రుణాలు చెల్లించిన వారిని సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి స్వనిధి పేరుతో బ్యాంకులు అందిస్తున్న రుణాలను చిరు వ్యాపారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి స్వనిధి రుణాలపై అవగాహన సదస్సు, లక్ష్యాలను సాధించిన వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన రుణాలను చెల్లిస్తే, మళ్లీ అధిక మొత్తంలో తిరిగి రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకులు వద్ద పెండింగులో ఉన్న అన్ని రుణాలను వీలైనంత తొందరగా విడుదల చేయాలన్నారు. కాగా.. ఈ స్కీమ్‌లో రుణాలు తీసుకుని సక్రమంగా తిరిగి చెల్లించిన చిరువ్యాపారులకు కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా సత్కారం నిర్వహించారు. మొదటి విడత రూ.10 వేలు తీసుకుని, తిరిగి సక్రమంగా చెల్లించిన వారికి 2వ విడతగా రూ.20 వేలు, అలాగే రెండో విడత లోన్ సక్రమంగా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రుణాలను సక్రమంగా చెల్లిస్తున్న వారికి 7 శాతం వరకు వడ్డీ రాయితీ వారి ఖాతాకు జమ అవుతుందన్నారు. గూగుల్ పే, ఫోన్ పే, భారత్ పే లాంటి ప్లాట్‌ఫాం వాడుతూ డిజిటల్ లావాదేవీలు చేస్తున్నట్లయితే వారికి కాష్ బ్యాక్‌లు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కృష్ణయ్య , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మిశ్రా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డీబీ ప్రసాద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. .

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


ప్రమాదానికి కారణమైన లారీ

రాజానగరం: మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ లారీని వేగంగా నడిపి రోడ్డు పక్కన ఆగివున్న మరో లారీని ఢీకొన్నాడు. దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. గామన్ బ్రిడ్జి వైపు నుంచి రాజానగరం వైపు వెళ్లున్న లారీ దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కన ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ క్లీనర్ వైపు భాగం నుజ్జునుజ్జయ్యింది. అయితే ఆ లారీలో క్లీనర్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆగిఉన్న లారీ వెనుక భాగం కూడా కొంతవరకు దెబ్బతిన్నా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందించారు.

మెడికల్ కిట్ల పంపిణీ


ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మెడికల్ కిట్లు, ప్లాస్టిక్ టబ్స్ పంపిణీ చేస్తున్న డాక్టర్ సుమతి, డాక్టర్ మీనాక్షి

అనపర్తి: మండలంలోని రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సమకూర్చిన మెడికల్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమతి, డాక్టర్ మీనాక్షిల చేతుల మీదుగా వ్యాధిగ్రస్తులకు మెడికల్ కిట్లు, ప్లాస్టిక్ టబ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధిగ్రస్తులు తమ కాళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ వైద్యుల సిఫార్సు మేరకు మందులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంపీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్య

రాజానగరం: ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తతుంగపాడుకు చెందిన మేడిది శ్రీనుకు ఎకరం పొలం ఉంది. మరో ఎకరం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మద్యపానం అలవాటు ఉన్న అతడు వ్యవసాయం, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పుల బాధతో పాటు వాటి విషయమై తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. దీంతో విసిగిపోయిన శ్రీను సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నన్నయలో ఎంపీఈడీ కోర్సు


ఎంపీఈడీ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) కోర్సును తక్కువ ఫీజులతో అందిస్తున్నామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ కోర్సు బ్రోచర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎంపీఈడీ కోర్సు తమ వర్సిటీలో మాత్రమే ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాస్ఫూర్తి ఉన్న విద్యార్థులకు అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ కోర్సు ప్రారంభించామన్నారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు కూడా దీనిలో చేరవచ్చన్నారు. ఈ కోర్సు చేసే విద్యార్థుల కోసం వర్సిటీ క్యాంపస్‌లో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్టులు, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కన్నమాంబ తల్లి జాతర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట వద్ద శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కన్నమాంబ తల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ జాతరకు వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ గౌడ, శెట్టిబలిజ సంఘాల కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను, వార్డు ఇన్‌చార్జి సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, జాతర కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో పాడి రక్ష


ఏపీత్రయంలో పశువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

- క్రమం తప్పకుండా టీకాలతో మేలు
- పశువుల కొట్టాంలో పరిశుభ్రమైన వాతావరణం అవసరం

పెదపూడి: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశువులు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పశువులు వ్యాధుల బారిన పడుతుండడంతో రైతులు అనేక వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగులు, బావుల్లో ఒక్కసారిగా నీరు చేరి కలుషితమవుతుంటాయి. కలుషిత నీరు తీసుకోవడంతో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, దొమ్మ, గాలికుంటు తదితర వ్యాధులు సోకే ప్రమాదముందని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. వ్యాధుల బారిన పడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు ఏడాదికి రెండుసార్లు వేయించాలి. జబ్బవాపు నివారణకు ఒకసారి టీకా వేయిస్తే ఏడాది పాటు అంటు వ్యాధులు సోకకుండా ఉంటాయి. గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు నివారణకు రక్షా ట్రయోడాక్ టీకాని ఒకసారి వేయిస్తే మూడు ప్రమాదకరమైన అంటువ్యాధులు సోకకుండా ఉంటాయి. ఆల్బెండజోల్ మందు తాగించాలి. పశువులకు వర్షాకాలంలో పాడి ప్రాంతాల్లో మాత్రమే మేపాలి. తేమ ప్రాంతాల్లో తీసుకువచ్చిన గడ్డిని ఎండబెట్టి మేపడం మంచిది. తడిచిన, కుళ్లిన గడ్డిని మేపకూడదు. పరిశుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచాలి. పశువుల కొట్టాల్లో బురద, తేమ, రొచ్చు ఉంటే పలు వ్యాధులు సోకే ప్రమాదముంటుంది. పశువుల శాలలను ఎప్పటికప్పుడు క్రిమి సంహారక మందులు వేసి శుభ్రం చేసి పొడిగా ఉండేలా చూడాలి. వర్షపు జల్లు, చలిగాలులు, ఉరుములు, మెరుపుల నుంచి పశువులను సంరక్షించాలి. పోషక విలువలతో కూడిన సమీకృత దాణా, బలవర్ధకమైన పచ్చిమేతను అందించాలి.

పశు సంపద వివరాలు..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
అనపర్తి	1256	8644	2954	621
పెదపూడి	2160	10445	29	542
బిక్కవోలు	1203	5798	8969	1,707
రంగంపేట	7623	11045	3269	3123
రాజానగరం	10,244	21,327	65,582	6,131
సీతానగరం	5194	10,334	4,468	3,831
కోరుకొండ	5,280	13,074	4,903	4,963
మొత్తం	32,960	80,667	90,174	20,918

అందుబాటులో టీకాలు



పశువులకు చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా సరే వెంటనే వైద్యం అందించాలి. ఈ సీజనలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా పశువులను రక్షించుకోవచ్చు. ప్రధానంగా పశువులు కలుషిత నీటిని తాగకుండా చూసుకోవడంతో పాటు పశువుల కొట్టాంను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పశువైద్యశాలల్లో వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయి.

– సయ్యద్ గౌసియా సోని, పశువైద్యాధికారి, పెదపూడి మండలం